సాక్షి రాజన్న సిరిసిల్ల

గురువారం । 7 । డిసెంబర్ । 2023



ఘనంగా ఆరట్టు మహోత్సవం

వేములవాడఅర్బన్: తిప్పాపూర్‌లోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం ఆరట్టు మహోత్సవం ఘనంగా నిర్వహించారు.



రాజన్న వసతిగదుల ధరలు పెంపు

రాజన్న వసతిగదుల ధరలను పెంచుతూ ఆలయ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. పెంచిన ధరలు అమలులోకి వచ్చాయి.

- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
23.0/20.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి

- సెస్ చైర్మన్ చిక్కాల రామారావు



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న సెస్ అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సెస్ పరిధిలోని రైతులకు, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు మరిన్ని చర్యలు తీసుకుంటున్నామని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు పేర్కొన్నారు. మండలంలోని రాజన్నపేటలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను బుధవారం పరిశీలించారు. సబ్‌స్టేషన్‌లోని ఫీడర్లు, బ్రేకర్లు, రికార్డులను తనిఖీ చేశారు. చిక్కాల రామారావు మాట్లాడుతూ గ్రామాల్లో లూజ్‌వైర్లను మరమ్మతు చేసి లోవోల్టేజీ సమస్యను పరిష్కరిస్తామన్నారు. సబ్‌స్టేషన్‌లో ప్రతీ ఫీడర్ ద్వారా నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. సరఫరాలో సాంకేతిక లోపాలు ఉంటే వెంటనే సరిచేయాలని సూచించారు. పెండింగ్ విద్యుత్ బిల్లులు చెల్లించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సంస్థ అభివృద్ధికి అధికారులతోపాటు ప్రజలు సహకరించాలని కోరారు. ఆపరేషన్ సెక్షన్ డీఈ శ్రీనివాస్, ఏడీఈ మహేందర్, ఏఈ పృథ్వీధర్ ఉన్నారు.

ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన

- జిల్లా విద్యాధికారి రమేశ్



ఆవునూర్‌లో విద్యాబోధన పరిశీలిస్తున్న డీఈవో

ముస్తాబాద్(సిరిసిల్ల): ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన చేయాలని జిల్లా విద్యాధికారి రమేశ్ సూచించారు. ముస్తాబాద్‌లోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని, ఆవునూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా పరిశీలించి మాట్లాడారు. కస్తూర్బా విద్యాలయంలో ఉపాధ్యాయ బృందం తరగతులను ప్యానల్ కమిటీ పరిశీలించింది. విద్యార్థులకు అందుతున్న బోధనను పరిశీలించి పలు సూచనలు చేసింది. తరగతులు, హాస్టల్ నిర్వహణపై సలహాలు ఇచ్చారు. సెక్టోరియల్ ఆఫీసర్ పద్మజ, ప్యానల్ కమిటీ బాధ్యులు సదానందం, నర్సింలు, ప్రత్యేకాధికారి శ్రీలత, హెచ్‌ఎం లక్ష్మణ్, పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



ఆలయం ముందు స్వీట్లు పంచుతున్న మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యలక్ష్మి

వేములవాడఅర్బన్: వేములవాడ ఎమ్మెల్యేగా ఆది శ్రీనివాస్ విజయం సాధించడంతో మహిళా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాత సత్యలక్ష్మి బుధవారం రాజన్నకు కోడెమొక్కులు చెల్లించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం ముందు స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజానాయకుడు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సారథ్యంలో వేములవాడ పట్టణంతోపాటు నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని కోరుకుంటున్నామన్నారు. పార్టీ పట్టణాధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్, కనికరపు రాకేశ్, కూరగాయల కొమురయ్య, పులి రాంబాబు, కృష్ణాగౌడ్, మల్లేశం, శ్రీధర్, సాబీర్ ఉన్నారు.

జిల్లా అంతటా వర్షం


- ముస్తాబాద్‌లో అత్యధికంగా 4.1 మిల్లీమీటర్లు
- బోయినపల్లిలో అత్యల్పంగా 1.2 మిల్లీమీటర్లు

సిరిసిల్ల: జిల్లా అంతటా తుంపర్లతో కూడిన వర్షం కురిసింది. తుఫాన్ ప్రభావంతో జిల్లాలోని అన్ని మండలాల్లో వర్షం పడింది. అత్యధికంగా ముస్తాబాద్‌లో 4.1 మిల్లీమీటర్లు, అత్యల్పంగా బోయినపల్లిలో 1.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రుద్రంగిలో 2.6, చందుర్తిలో 2.3, వేములవాడ రూరల్‌లో 1.6, వేములవాడలో 3.6, సిరిసిల్లలో 3.5, కోనరావుపేటలో 2.8, వీర్నపల్లిలో 1.3, ఎల్లారెడ్డిపేటలో 3.1, గంభీరావుపేటలో 2.5, తంగళ్లపల్లిలో 3.1, ఇల్లంతకుంటలో 3.6 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు సీపీవో పీబీ శ్రీనివాసచారి బుధవారం తెలిపారు.

ఇక ‘పల్లె పోరు’

ఫిబ్రవరి ఒకటితో ముగియనున్న పంచాయతీల గడువు

- సంసిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్లకు ఎస్‌ఈసీ ఆదేశాలు
- ఉమ్మడి జిల్లాలో పంచాయతీరాజ్ ఆకస్మిక సమావేశాలు
- పెరిగిన ఓట్లతో స్వల్పంగా పెరగనున్న పోలింగ్ కేంద్రాల సంఖ్య



పెరిగిన ఓటర్ల సంఖ్య ఇలా..

నియోజకవర్గం	కొత్త ఓటర్లు
కోరుట్ల	20,652
జగిత్యాల	24,021
ధర్మపురి	17,890
రామగుండం	25,882
మంథని	23,591
పెద్దపల్లి	27,413
కరీంనగర్	54,831
చొప్పదండి	16,957
వేములవాడ	25,451
సిరిసిల్ల	22,408
మానకొండూర్	15,909
హుజూరాబాద్	35,181
హుస్నాబాద్	14,005

ఉమ్మడి జిల్లా పంచాయతీ సమాచారం

జిల్లా	మండలాలు	పంచాయతీలు	వార్డులు
పెద్దపల్లి	14	263	2436
జగిత్యాల	20	380	3500
సిరిసిల్ల	13	255	2444
కరీంనగర్	16	313	2966

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/సాక్షి, పెద్దపల్లి: అసెంబ్లీ పోరు ముగిసిన నేపథ్యంలో మరో ఎన్నికల పోరుకు తెరలేవనుంది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణకు రాష్ట్రఎన్నికల సంఘం(ఎస్‌ఈసీ) సిద్ధం అవుతోంది. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఉమ్మడి జిల్లా కలెక్టర్లకు ఎస్‌ఈసీ ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా సర్పంచులు, వార్డు సభ్యుల రిజర్వేషన్లకు సంబంధించిన వివరాల కోసం జిల్లాల వారీగా నివేదికలు పంపాలని ఆదేశాలు జారీచేసింది.

ఫిబ్రవరి ఒకటితో ముగియనున్న పదవీకాలం

వచ్చే ఏడాది(2024) ఫిబ్రవరి ఒకటో తేదీన సర్పంచుల పదవీకాలం ముగియనుంది. ఆర్టికల్ 2(4)(3) ప్రకారం గ్రామపంచాయతీల పదవీకాలం ఐదేళ్లు. పంచాయతీరాజ్ యాక్ట్14(2) ప్రకారం గ్రామ పంచాయతీల పదవీకాలం ముగియడానికి మూడు నెలల ముందుగానే ఎన్నికలు నిర్వహించాలి. ఈమేరకు ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి ముందస్తుగా సమాచారం ఇస్తుంది. అలాగే తగిన ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీచేస్తుంది. ఆ మేరకు రిజర్వేషన్లకు సంబంధించి గ్రామ కార్యదర్శులు ఎన్నికల అధికారులకు నివేదికలు పంపాల్సి ఉంటుంది. వాటిని క్రోడీకరించిన తర్వాత రిజర్వేషన్లతోసహా ఎన్నికల తేదీలు ప్రకటిస్తారు. అందులో భాగంగానే తాజాగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల కలెక్టర్లకు ఆదేశాలు వచ్చాయి. ఎన్నికల సిబ్బంది, సాంకేతిక అంశాల పరంగా సంసిద్ధంగా ఉండాలని ఆదేశాల్లో ఎస్‌ఈసీ స్పష్టంచేసింది. ఈ మేరకు జిల్లా పంచాయతీ కార్యదర్శులతో బుధవారం ఆకస్మిక సమావేశం నిర్వహించిన జిల్లా అధికారులు.. ఎస్‌ఈసీ సూచనలు, ఎన్నికల ప్రక్రియ, అనుసరించాల్సిన వ్యూహం, మానవ వనరులు, సాంకేతిక అంశాలపై చర్చించారు.

పెరిగిన ఓట్లు.. బూత్‌లు పెరిగేనా!

ఉమ్మడి జిల్లాలో 2018 ఎన్నికల నాటికి 13 నియోజకవర్గాల్లో 27,88,092 మంది ఓటర్లు ఉండగా.. తాజాగా జరిగిన ఎన్నికల్లో 31,12,283 మందికి చేరుకున్నారు. కొత్తగా 3,24,191 మంది ఓటర్లు వచ్చారు.

మరిన్ని పెరిగే అవకాశం..

గ్రామ పంచాయతీ ఎన్నికల తేదీ నాటికి కొత్త ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. తాజాగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాల మేరకు 200 మంది ఓటర్ల వరకు ప్రతీ పోలింగ్ బూత్‌కు ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఒక పోలింగ్ ఆఫీసర్ ఉండాలని, 201 నుంచి 400 ఓట్ల వరకు ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఇద్దరు పోలింగ్ ఆఫీసర్లు, 401 నుంచి 650 ఓటర్ల వరకు ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ముగ్గురు పోలింగ్ ఆఫీసర్లు ఉండాలి. ఈ మేరకు సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని తెలిపింది. 650 ఓట్లు దాటితే అధికారులు అదనంగా పోలింగ్ బూత్ ఏర్పాటు చేయనున్నారు.

మూడు దశల్లో ఎన్నికలు..!

జనాభా దామాషా పద్ధతిన రిజర్వేషన్లు ఖరారు కానున్నాయి. గ్రామాల్లోని జనాభాను బట్టి బడుగు, బలహీనులు పోటీ చేసే అవకాశాలు ఉంటాయి. అయితే, ఈసారి.. ఐదేళ్ల కింద జరిగిన పద్ధతిలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేసే అవకాశాలు ఉన్నాయి. ఈసారి కూడా గతంలో లాగానే మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. తొలిదశలో వినియోగించుకున్న సిబ్బందిని మూడోదశలోనూ వినియోగించనున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,211 గ్రామాలకు ఎన్నికలు జరగనున్నాయి. అయితే, కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం ఇంకా గ్రామస్థాయిలో రాజకీయ పరిస్థితులను అధ్యయనం చేయాల్సి ఉంది. ఆ తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తుంది. అయితే, గడువులోగానే ఎన్నికలు నిర్వహిస్తుందా? లేక మరికొంత సమయం తీసుకుంటుందా? అనేది వేచిచూడాలి.

అభివృద్ధి, సంక్షేమానికి పట్టం

- ప్రలోభ పెట్టినా.. కుట్రలు చేసినా.. ప్రజలు ఆశీర్వదించారు
- బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇస్తరో? లేదో?
- మనపై కేసులు పెట్టవచ్చు.. భయపడొద్దు
- సిరిసిల్లలో ఎమ్మెల్యే కె.తారక రామారావు



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కేటీఆర్

సిరిసిల్ల: సిరిసిల్ల ప్రజలు మరోసారి అభివృద్ధి.. సంక్షేమానికి పట్టం కట్టారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక ఎమ్మెల్యే కె.తారక రామారావు పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ఐదోసారి ఎన్నికైన తరువాత తొలిసారి బుధవారం సిరిసిల్లకు వచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ సిరిసిల్లలో ఎవరు ఎన్ని కుట్రలు చేసినా.. ప్రలోభాలకు గురిచేసినా ప్రజలు మాత్రం అభివృద్ధిని గెలిపించినందుకు సిరస్సు వంచి నమస్కారాలు తెలియజేస్తున్నానన్నారు. ఎన్నికల్లో ఓటర్లకు పైసలు ఇవ్వను.. మందు పొయ్యను.. అని చెప్పినట్లు మాటకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. సిరిసిల్ల ఎమ్మెల్యేగా గర్వపడుతున్నానని పేర్కొన్నారు. రాష్ట్రంలో చాలాచోట్ల ‘మా ఎమ్మెల్యే ఓడిపోవాలే.. కానీ కేసీఆర్ మళ్లీ రావాలే’ అని ఓట్లు వేశారని, చెయ్యి గుర్తుకు ఓటు వేసి.. కేసీఆర్ రావాలే అని కోరుకున్నవారు ఉన్నారన్నారు.

ఆత్మవిమర్శ చేసుకోవాలి

సిరిసిల్లలో మన మెజార్టీ 60వేలు తగ్గింది. కారణాలేమిటో ఆత్మవిమర్శ చేసుకోవాలేనని కేటీఆర్ అన్నారు. అధికారం పోయిందని బాధపడొద్దు.. అధైర్యపడొద్దు.. ఇదేం శాశ్వతం కాదు.. మళ్లీ మన రోజులు వస్తాయని కేటీఆర్ వివరించారు. ప్రజల్లో ఉండాలే.. ఇప్పుడు పంచాయతీ, మున్సిపల్, పార్లమెంట్ ఎన్నికలు వస్తాయి. అన్నింటికి సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు సూచించారు. నేను మంత్రిగా ఉండగా.. మీకు సమయం ఇవ్వలేకపోయినా.. ఇప్పుడు నాకేం పని.. మీతోనే ఉంటా.. మీతో కూర్చుంటానని తెలిపారు.

బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇస్తారో.. లేదో?

ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లను సిరిసిల్లకు ఇస్తుందో? లేదో? తెలియదని కేటీఆర్ అనుమానం వ్యక్తం చేశారు. సిరిసిల్ల అంటే.. వాళ్లకు కోపం ఉంటుంది.. కొన్ని ఇబ్బందులు ఉంటాయి.. కొందరు చెదిరిపోతే.. చెదిరిపోతారు.. కానీ పార్టీ మీద ప్రేమతో.. కేసీఆర్‌పై నమ్మకంతో ఉంటే.. భవిష్యత్ ఉంటుందని భరోసానిచ్చారు. ప్రతిపక్షంలో ఉన్నాం.. కాబట్టి భయపట్టే ప్రయత్నాలు జరుగుతాయని, మనపై కేసులు కూడా పెడతారన్నారు. దేనికి భయపడొద్దని.. ఓట్లు వేయలేదని ప్రజలను కూడా నిందించొద్దని.. సోషల్ మీడియాలో కామెంట్లు పెట్టొద్దని సూచించారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్లు జిందం కళాచక్రపాణి, రామతీర్థం మాధవి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బీఆర్‌ఎస్ నాయకులు చీటి నర్సింగరావు, జిందం చక్రపాణి, బొల్లి రామ్మోహన్, అక్కరాజు శ్రీనివాస్, గజభీంకార్ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫీలు దిగుతూ... పలకరిస్తూ

ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత మొదటిసారి సిరిసిల్లకు వచ్చిన కేటీఆర్‌కు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి క్యాంపు ఆఫీస్‌లో పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణభవన్‌లో అందరిని పలకరిస్తూ.. సెల్ఫీలు దిగారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులతో జెడ్పీ చైర్‌పర్సన్ తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

కోనరావుపేట(వేములవాడ): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ కోరారు. మండలంలోని మరిమడ్లలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో రెసిడెన్షియల్ స్కూల్స్ ఆధ్వర్యంలో రెండో రాష్ట్రస్థాయి క్రీడాపోటీలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ మాట్లాడుతూ క్రీడలలో గెలుపోటములు సహజంగా స్వీకరించాలన్నారు. ఎంపీపీ చంద్రయ్య, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ బండ నర్సయ్య, సర్పంచ్ మాట్ల అశోక్, ఎంపీటీసీ రేణుక, ఆర్‌సీవో వెంకన్న, ప్రిన్సిపాల్ భాస్కర్, నాయకులు రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

రాష్ట్రస్థాయిలో జరిగే బాస్కెట్‌బాల్ అండర్–14 విభాగంలో మండలంలోని కనగర్తి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని పులి నక్షత్ర ఎంపికైనట్లు జిల్లా పాఠశాల క్రీడల కార్యదర్శి దేవత ప్రభాకర్ తెలిపారు. ఈనెల 8 నుంచి 10 వరకు రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో నక్షత్ర పాల్గొంటుందని తెలిపారు. నక్షత్రను సర్పంచ్ అనుపాటి భారతి, హెచ్‌ఎం వినోద్‌కుమార్, పీఈటీ అజయ్‌కుమార్ అభినందించారు.



జాతీయ శిక్షణకు ఎంపికైన రాజశేఖర్



విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్‌ఎం

జాతీయ ఖోఖో కోచ్ శిక్షణకు ఎంపిక

స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొనసాగుతున్న నేతాజీ సుభాష్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ పట్యాల(పంజాబ్)కు మండలంలోని కనగర్తికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు కురుకుంట్ల రాజశేఖర్ ఎంపికయ్యారు. ప్రస్తుతం ఇంగ్లిష్ యూనియన్ స్కూల్‌లో పనిచేస్తున్న రాజశేఖర్‌కు ఈమేరకు స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సమాచారం అందింది. ఆరువారాలపాటు శిక్షణ ఇస్తారు.

మంత్రివర్గంలో మనోళ్లు ?!

- దుద్దిళ్ల, పొన్నంలకు చోటు
- జీవన్‌రెడ్డికి సైతం అవకాశం



జీవన్‌రెడ్డి



శ్రీధర్‌బాబు



పొన్నం ప్రభాకర్

సాక్షిప్రతినిధి,కరీంనగర్: కాంగ్రెస్ పార్టీ సారథ్యంలో సీఎంగా గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్న ఎనుముల రేవంత్‌రెడ్డి కేబినెట్‌లోకి ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురిని మంత్రివర్గంలోకి చోటు లభించనుంది. రాష్ట్రం ఏర్పాటు అయ్యాక మూడోసారి కొలువుదీరనున్న మంత్రివర్గంలోకి మంథని నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, హుస్నాబాద్ నుంచి విజయం సాధించిన పొన్నం ప్రభాకర్‌లకు మంత్రివర్గంలో స్థానం లభించడం ఖాయమైనట్లు సమాచారం. సీనియర్ నాయకుడు తాటిపర్తి జీవన్‌రెడ్డికి సైతం మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించేందుకు కాంగ్రెస్ అగ్రనాయకత్వం యోచిస్తోంది. పెద్దపల్లి జిల్లాకు చెందిన మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు గతంలో వైఎస్సార్, కిరణ్‌కుమార్‌రెడ్డిల కేబినెట్‌లో మంత్రిగా పనిచేసిన అనుభవంతోపాటు ఎన్నికల మేనిఫెస్టో చైర్మన్‌గా వ్యవహరించారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఆ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా పనిచేసి పార్టీ అధిష్టానం దృష్టిలో పడ్డారు. బ్రాహ్మణ సామాజిక వర్గం నుంచి గెలిచిన శ్రీధర్‌బాబుకు అన్ని అర్హతలు ఉన్నాయని, కీలక పదవీ వరించనుందని విశ్వసనీయ సమాచారం. మాజీ ఎంపీగా, గతంలో మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా పనిచేయడమే కాకుండా ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర బాధ్యులుగా వ్యవహరించి పార్టీ అధిష్టానం దృష్టిలో గుర్తింపు పొందిన హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన పొన్నం ప్రభాకర్‌కు బీసీ కోటాలో మంత్రి పదవి వరించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. తెలంగాణ ఉద్యమసమయంలో పార్లమెంట్‌లో ఆయన పాత్రతోపాటు సామాజిక సమీకరణాల్లో పొన్నం ప్రభాకర్ ముందు వరుసలోనే ఉన్నట్లు వినికిడి. సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, జగిత్యాల ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డిని అనుభవం రీత్యా మంత్రివర్గంలోకి తీసుకొని ఆయన సేవలను వినియోగించుకోవాలని పార్టీ అధిష్టానం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు అమాత్యులుగా ప్రమాణం చేయనున్నారని సమాచారం.

రైతుల గుండెల్లో తుపాన్

- తుంపరవర్షంతో ఆందోళన
- ధాన్యం కొనుగోళ్లలో జాప్యం
- వడ్లకుప్పలపై కవర్లు కప్పిన రైతులు
- ఎండిన వడ్లు తడుస్తాయనే భయం
- జిల్లాలో 3.50 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు లక్ష్యం
- ఇప్పటికీ 1.72 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు
- తూకం వేసినా డబ్బులు చెల్లింపుల్లోనూ జాప్యం
- ఎన్నికల బిజీలో రైతులను పట్టించుకోని అధికారులు

“వడ్లకుప్ప వద్ద కూర్చున్న ఇతను గాజ భూమయ్య. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన భూమయ్య 15 రోజుల కిందట వడ్లను మార్కెట్లో పోశాడు. తేమ శాతం వచ్చినా తూకం వేయలేదు. ఇప్పుడు తుఫాన్‌తో వడ్లు తడుస్తాయని కుప్పలపై ఇలా కవర్లు కప్పాడు. ఎప్పుడు తూకం వేస్తారోనని భూమయ్య నిరీక్షిస్తున్నాడు.



వీర్నపల్లి మండలం రంగంపేటలో రైతులు వడ్లకుప్పలపై కవర్లు కప్పారు. కానీ వర్షానికి ఏమైనా వడ్లు తడిశాయా? లేదా? అనే అనుమానంతో ఇలా చూస్తున్నారు. ఒక్క రంగంపేటలోనే కాదు.. లాల్‌సింగ్‌తండా, గర్జనపల్లి, శాంతినగర్, వన్‌పల్లిల్లోనూ ఇలాగే తూకం వేయకుండా ఉన్న ధాన్యం రాసులు ఉన్నాయి. వడ్లను రైతులు ఆరబెట్టి తూకం వేసేందుకు సిద్ధంగా తేమశాతం వచ్చినా.. తూకం వేయడంలో జాప్యంతో ఇలా ఇబ్బంది పడుతున్నారు.”




సిరిసిల్ల: జిల్లా అంతటా తుపాన్ ప్రభావం తీవ్రంగా ఉంది. జిల్లాలో తుంపరవాన పడుతుండడంతో చలిగాలులు వీస్తున్నాయి. వానాకాలం సీజన్‌లో జిల్లాలో 1.74 లక్షల ఎకరాల్లో వరిపంటను రైతులు సాగుచేశారు. జిల్లాలో 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కానీ ఇప్పటి వరకు జిల్లాలో 1.72 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. మరో 30 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాల్సి ఉంది. ఎన్నికల హడావుడిలో పడి అధికారులు ధాన్యం కొనుగోళ్లను జాప్యం చేశారు. ఆరబెట్టిన ధాన్యం మళ్లీ తడుస్తుందనే భయంతో రైతులు వడ్లకుప్పలపై టార్పాలిన్లు, ఇతర కవర్లు కప్పారు. చాలా మంది రైతులు ముందుగానే పచ్చివడ్లను రైస్‌మిల్లర్లకు నేరుగా రూ.1,800 క్వింటాలు చొప్పున అమ్ముకున్నారు. ప్రభుత్వం మద్దతు ధరను రూ.2,203 నిర్ణయించగా.. ప్రతి క్వింటాలుకు రూ.400 తక్కువకే అమ్ముకున్నారు. ఇంకా క్షేత్రస్థాయిలో ఉన్న వడ్లను కొనుగోలు చేయడంలో జాప్యం చేస్తున్నారు.

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల స్వరూపం

కొనుగోలు కేంద్రాలు: 259	వడ్లను అమ్మిన రైతులు : 23,056
ఇప్పటికే మూసివేసిన కేంద్రాలు: 75	కొనుగోలు చేసిన ధాన్యం విలువ : రూ.375.04 కోట్లు
కొనుగోలు చేసిన ధాన్యం : 1,72,240.120 మెట్రిక్ టన్నులు	రైతులకు చెల్లించిన మొత్తం : రూ.243.95 కోట్లు
	డబ్బులు పొందిన రైతులు : 19,682

ఒక్క గింజా కొనలేదు



మూడెకరాల వరి పొలాన్ని కోసి అమ్మేందుకు కుప్పపోసిన. వడ్లను ఆరబెట్టి జోకేందుకు సిద్ధంచేసినా.. ఒక్క గింజా కొనలేదు. ఎప్పుడు జోకుతారోనని ఎదురుచూస్తున్న. ఇంతలోనే వర్షం ముసురుకుంది. వడ్లు జోకితే ఈ బాధ ఉండకపోవు.

– కనకట్ల కిట్టు, రైతు, రంగంపేట

20 రోజుల కిందట వడ్లుపోసిన



మాకు ఎకరం 30 గుంటల భూమి ఉంది. 20 రోజుల కిందటే వరిని కోసి కొనుగోలు కేంద్రంలో పోసిన. వడ్లను ఆరబెట్టిన 100 సంచులు అయినయి. ఇంకా తూకం వేయలేదు. వర్షం రావడంతో జోకుడు ఆపేశారు. చాలా మంది రైతులు నాలాగే ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా వడ్లు తూకం వేయాలే.

– బండి ప్రభాకర్, రైతు, కోనరావుపేట

ఇంకా వడ్ల పైసలు రాలేదు



నేను 25 రోజుల కిందటే వడ్లు అమ్మిన. 37 క్వింటాళ్లు అయినయి. మూడు రోజులకే డబ్బులు బ్యాంకు ఖాతాలో వేస్తామని చెప్పిండ్రు. కానీ 25 రోజులైనా వడ్ల పైసలు రాలేదు. వడ్ల పైసలు వస్తేనే యాసంగి పెట్టుబడికి వాడుకుంటాం. అధికారులు స్పందించి వడ్ల పైసలు తొందరగా బ్యాంకు ఖాతాల్లో వేయాలే.

– మునిగె శంకర్, రైతు, లక్ష్మీపూర్

పది రోజుల్లో కొనుగోళ్లు పూర్తి



జిల్లాలో తుఫాన్ వర్షం ఉన్నా పెద్దగా ప్రభావం లేదు. వడ్ల కొనుగోళ్లు చివరికి వచ్చాయి. ఇప్పటికే చాలా కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తయ్యాయి. తుఫాన్‌తో రైతులకు పెద్దగా ఇబ్బంది లేదు. రుద్రంగి, మా నాల ప్రాంతాల్లో వడ్లు ఉన్నాయి. పది రో జుల్లో మొత్తం కొనుగోళ్లు పూర్తవుతాయి.

– ఎస్.జితేందర్‌రెడ్డి, డీఎస్‌వో, సిరిసిల్ల

క్లుప్తంగా

నూతన వధూవరులకు కేటీఆర్ ఆశీర్వాదం



అభిమన్యును ఆశీర్వదిస్తున్న కేటీఆర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బొమ్మకంటి భాస్కర్–జ్యోతి దంపతుల కుమారుడు అభిమన్యు వివాహం సుదీప్తతో జరుగనుండగా బుధవారం వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ కలిసి ఆశీర్వదించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన మిర్యాల్కర్ శ్రీనివాస్ కూతురు సృజన వివాహం జరుగగా.. వారి దంపతులను ఆశ్వీదించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్‌కుమార్, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

'తెలుగు మహాసభలను విజయవంతం చేయండి'



మాట్లాడుతున్న పర్శరాములు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థలు సంయుక్తంగా జనవరిలో రాజమహేంద్రవరంలో రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నట్లు ప్రచారకార్యదర్శి డాక్టర్ వాసరవేణి పర్శరాములు తెలిపారు. 25 సాహిత్య ప్రక్రియలపై సదస్సులు ఉంటాయని, భాషాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 'మాతృభాష పరిరక్షణకు భాషోపాధ్యాయుల కర్తవ్యం' 'మాతృభాష ద్వారా నైతిక విలువల పరిరక్షణ' 'సాంకేతిక పరిజ్ఞానంతో మాతృభాషాభివృద్ధి' 'సాహిత్యం మాతృభాష తులనాత్మకత' అనే అంశాలపై ఈనెల 15లోపు వ్యాసాలు పంపాలని కోరారు. వివరాలకు 90007 34466, 94945 53425 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. రచయిత దుంపెన రమేశ్, గజభీంకార్ అజయ్, మహమ్మద్ రిహాన్, దుంపెన సుధీర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కృతజ్ఞతా ర్యాలీ



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం కృతజ్ఞతా ర్యాలీ నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజుయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, జిల్లా కార్యదర్శి గిరిధర్‌రెడ్డి, చెన్ని బాబు, సంతోష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చీకటిపూట ప్రాణాలు పోతున్నాయ్

- జిల్లాలో నెల వ్యవధిలో ఐదుగురు మృతి
- అతివేగం.. మూలమలుపుల వద్దే ప్రమాదాలు
- నిబంధనలు కఠినతరం చేయని అధికారులు



ప్రమాదకరంగా మూలమలుపు



ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): చీకటిపూట జరుగుతున్న ప్రమాదాలు ప్రాణాలను తీస్తున్నాయి. వేకువ జామున నిద్ర మత్తులో జిల్లాలో చోటు చేసుకుంటున్న ప్రమాదాలు మృతుల కుటుంబాల్లో విషాదం నింపుతున్నాయి. హెల్మెట్ ధరించకపోవడం, అతివేగం, చీకట్లో రోడ్డుపై నిలిపిన వాహనాలు కనిపించకపోవడం, రోడ్డుపక్కన విద్యుత్ స్తంభాలు, గుంతలు, ముళ్ల పొదలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. జిల్లాలో నెల రోజుల వ్యవధిలో వివిధ ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాలు ఐదుగురి ఉసురుతీశాయి. రెండు ప్రమాదాలు వేకువజామున, మరో ప్రమాదం రాత్రిపూట జరిగింది. రవాణాశాఖ, పోలీసులు సమన్వయంతో పనిచేయని మూలంగానే ప్రమాదాలు జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి.

వరుస ప్రమాదాలు ఐదుగురు మృతి..

జిల్లాలో నెల వ్యవధిలో జరిగిన ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. ప్రమాదాలన్నీ చీకట్లోనే జరిగాయి. వేములవాడ కమాన్‌వద్ద జరిగిన ప్రమాదంలో బర్త్ డే వేడుకలకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఆగివున్న లారీని ఢీకొట్టి ముగ్గురు మృతిచెందారు. తంగళపల్లి మండలం బద్దనపల్లికి చెందిన వ్యక్తి వెంకటాపూర్ వద్ద, రాచర్లగొల్లపల్లి శివారులోని సత్తేపీరీల దర్గా సమీపంలో గుర్తు తెలియని మతి స్థిమితం సరిగా లేని వ్యక్తి మరణించారు.

హెల్మెట్ ధరించకపోవడంతో..

రోడ్డు ప్రమాదాల్లో వాహనదారులు హెల్మెట్ ధరించని కారణంగానే తలకు తీవ్రగాయాలై మరణించారు. హెల్మెట్ ధరించి ప్రయాణాలు చేయాలనే అంశంపై రవాణాశాఖ, పోలీసు అధికారులు అవగాహన కల్పించకపోవడం లేదని విమర్శలున్నాయి. నిబంధనలు కఠినతరం చేయకపోవడంతో వాహనదారులు ఇష్టారీతిన హెల్మెట్ లేకుండా, మద్యం తాగి, అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారుల వెంట హెచ్చరిక బోర్డులు, ప్రమాదకర మూలమలుపుల వద్ద స్టిక్కర్లు అతికించని కారణంగా రాత్రిపూట ప్రమాదాలు జరిగి ప్రాణాలుపోతున్నాయి. నామమాత్రంగా మాసోత్సవాలు నిర్వహించకుండా రోడ్డు భద్రత, నిబంధనలపై ప్రజలను అప్రమత్తం చేసి ప్రమాదాలు జరగకుండా అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



రాత్రిపూట ప్రమాదాలు జరగకుండా రహదారుల వెంట అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. మూలమలుపుల వద్ద రోడ్డు పరిస్థితిని తెలిపేలా రేడియం స్టిక్కర్లు అంటించాలి. దారుల వెంట పాత బావులను పూడ్చివేయాలి. ఎల్లారెడ్డిపేట శివారులో డివైడర్స్ వద్ద రాత్రిపూట రోడ్డు తెలిసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– డేనియల్, ఆటో డ్రైవర్, ఎల్లారెడ్డిపేట

అవగాహన కల్పించాలి



రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనదారులకు అవగాహన కల్పించాలి. అతివేగమే ప్రమాదాలకు కారణమవుతున్న క్రమంలో వేగం పరిమితిని విధించాలి. సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకునే వాహనదారులపై చర్యలు తీసుకోవాలి. ద్విచక్ర వాహనాలపై ట్రిపుల్ రైడింగ్‌ను పూర్తిగా నిషేధించాలి. సరైన ధ్రువపత్రాలు లేకుండా, మద్యం తాగి వాహనాలు నడిపేవారిపట్ల కఠినంగా వ్యవహరించాలి.

– అంతెర్పుల సతీశ్, ఎల్లారెడ్డిపేట

నిత్యం వాహనాల తనిఖీ..



నిత్యం వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నాం. ధ్రువీకరణపత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తున్నాం. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపవద్దని అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా హెల్మెట్ ధరించి ప్రయాణాలు చేయాలని చెబుతున్నం. మద్యం తాగి వాహనాలు నడపడంతోనే అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహన తనిఖీల్లో జరిమానా విధిస్తున్నా మార్పు రావడం లేదు.

– శశిధర్‌రెడ్డి, సీఐ, ఎల్లారెడ్డిపేట

అమ్మను వదిలించుకున్నారు..

- రోడ్డుపై వదిలేశారు..



నటరాజ్ విగ్రహం వద్ద ఉన్న వృద్ధురాలు

వేములవాడఅర్బన్: నవమాసలు మోసి.. కనిపెంచిన అమ్మను వదిలించుకున్నారు. రోడ్డుపై వదిలేసి అనాథను చేశారు. కళ్లు కనిపించక.. మాటలు రాక.. ఎటూ వెళ్లలేక బిక్కుబిక్కుమంటూ ఆ మాతృమూర్తి చూపులు అందరిని కలచివేస్తున్నాయి. వేములవాడలోని భీమేశ్వర ఆలయం పక్కన ఉన్న నటరాజ్ విగ్రహం వద్ద మంగళవారం ఆటోలో తీసుకొచ్చి ఓ వృద్ధురాలును వదిలివేశారు. మాటలు స్పష్టంగా రాక, కళ్లు కనిపించక రోడ్డు పక్కన పడుకుని ఉంటుంది. గమనించిన స్థానికులు, హోటళ్ల యజమానులు ఆ వృద్ధురాలికి టిఫిన్, మంచినీరు అందించారు. రెండు రోజులుగా వర్షం కురుస్తుండడంతో చలికి తట్టుకోలేకపోతుంది. ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పడం లేదు.

అనుమానాస్పద స్థితిలో ఇంటర్ విద్యార్థి మృతి



అక్షయ్(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని నామాపూర్‌కు చెందిన ఇంటర్మీడియెట్ విద్యార్థి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు. నామాపూర్‌కు చెందిన మంగళి అక్షయ్(17) సోమవారం చీకోడు నుంచి స్నేహితుడితో కలిసి నామాపూర్ వైపు వస్తుండగా వాహనంపై నుంచి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలైన అక్షయ్‌ను సిరిసిల్ల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ముస్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న అక్షయ్ మృతిపై అనుమానాలున్నాయని తల్లిదండ్రులు శమంత, దేవయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక్కాగానొక్క కొడుకు మృతితో తాము దిక్కులేని వారమయ్యామని వారు రోదించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

అంబేడ్కర్ స్ఫూర్తి ప్రదాత



నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ
- సిరిసిల్లలో ఘనంగా వర్ధంతి

సిరిసిల్లటౌన్: అట్టడుగు వర్గాల్లో పుట్టి ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందిన బాబాసాహెబ్ అంబేడ్కర్ స్ఫూర్తి ప్రదాత అని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం సిరిసిల్లలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి రాజ్యాంగం అందించిన అంబేడ్కర్ ఆశయాలు ఆచరణీయమన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, మ్యాన రవి, ఎండీ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ నేతృత్వంలో అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సిరిసిల్లలోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు నాయకులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, ముఖ్య నాయకులు నాగుల సత్యనారాయణ, ఆకునూరి బాలరాజు, సంగీతం శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, యెల్లె లక్ష్మీనారాయణ, వైద్య శివప్రసాద్, వెల్ముల స్వరూప, సూర దేవరాజు, సామల దేవదాసు తదితరులు పాల్గొన్నారు. అంబేడ్కర్ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కత్తెర దేవదాసు, రాగుల జగన్, కంసాల మల్లేశం, నాలుక సత్యం తదితరులు పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో అధ్యక్షుడు కోడి లక్ష్మణ్, సీనియర్ న్యాయవాదులు ధర్మేందర్, నత్యనారాయణ తదితరులున్నారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ కంచర్ల రవిగౌడ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రగతి ఒకేషనల్ కాలేజీలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు.



పూలమాల వేస్తున్న టౌన్ సీఐ ఉపేందర్

రాజన్న వసతి గదుల ధరలు పెంపు

- వంద రూపాయల గదికి రూ.12 జీఎస్టీ
- కొత్త ధరలతో బోర్డు ఏర్పాటు



పెంచిన ధరలు తెలిపే బోర్డు

వేములవాడఅర్బన్: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ రాజన్నను దర్శించుకునేందు వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. పేదల దేవుడిగా పేరున్న రాజన్న ఆలయ అద్దె వసతి గదుల ధరలను పెంచుతూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు ఆలయం ఆవరణలోని గదుల సమీపంలో బోర్డును ఏర్పాటు చేశారు. రాజన్న అద్దె గదులకు రూ.100కు రూ.12 జీఎస్టీ వసూలు చేయడంతో సామన్య భక్తులకు భారంగా మారిందంటున్నారు. గతంలో రూ.వెయ్యి దాటిన అద్దె గదికి మాత్రమే జీఎస్టీ పన్ను వసూలు చేశారు. కానీ ఇప్పుడు రూ.100 గదికి కూడా రూ.12 జీఎస్టీ వసూలు చేస్తున్నారు. అలాగే అద్దె గదుల ధరలను కూడా పెంచారు. అమ్మవారి అతిథి గృహంలో గదికి అద్దె రూ.వెయ్యి ఉండగా దాన్ని రూ.1500లకు పెంచి జీఎస్టీతో కలిపి రూ.1,680 చెల్లించాలి. భీమేశ్వర అతిథిగృహం, నందీశ్వర సూట్ గదుల అద్దె రూ.2,200 ఉండగా దాన్ని రూ.2500లకు పెంచి రూ.300 జీఎస్టీతో కలిపి రూ.2,800 చెల్లించాలి. నందీశ్వరలో వసతిగదికి రూ.350 ఉండగా దానికి రూ.150 పెంచి రూ.500 చేయడంతో జీఎస్టీతో కలిపి రూ.560 చెల్లించాలి. పార్వతీపురం వసతిగది రూ.200 ఉండగా రూ.100 పెంచి దాన్ని రూ.300 చేసి జీఎస్టీతో కలిపి రూ.336 చెల్లించాలి. పార్వతీపురం బ్లాకులలో రూ.500 అద్దె ఉండగా దాన్ని రూ.100 పెంచి రూ.600 చేసి జీఎస్టీతో కలిపి రూ.672 చెల్లించాలి. లక్ష్మీగణపతి కాంప్లెక్స్‌లో గదికి రూ.250 ఉండగా రూ.150 పెంచి రూ.400 చేసి దాన్ని జీఎస్టీతో కలిపి రూ.448 చెల్లించాలి. శంకరపురం ధర్మశాల వసతి గది రూ.50 ఉండగా మరో రూ.50 పెంచి రూ.100 చేసి జీఎస్టీతో రూ.112 చెల్లించాలి. పెంచిన ధరలతో రాజన్న ఆలయ ఆవరణలోని గదుల సమీపంలో కొత్త ధరల బోర్డును ఏర్పాటు చేశారు.



మీరు చూస్తున్న ఈ ఫొటో 12వ వార్డు ఈదుల చెరువు ప్రాంతంలోనిది. ఇక్కడ రోడ్డు, మోరీ లేకపోవడంతో మురికికూపంతో దోమలు విపరీతంగా పెరిగాయి. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దుర్గంధంతోపాటు నిత్యం వ్యాధులతో సతమతమవుతుంటే అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడం లేదు.



ప్రారంభానికి ముందే శిథిలమైన ఈ ఓపెన్‌జిమ్ స్థానిక పదోవార్డులోని చిన్నబోనాల ప్రాంతం. ఆరోగ్య సిరిసిల్లలో భాగంగా మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేయగా.. రెండేళ్లుగా ఇలా వట్టిగనే ఉంటోంది. పరికరాల నాణ్యతలోపం, నిర్వహణ సరిగ్గా లేక పాడై పోయాయి. రిపేరు చేయించడంపై బల్దియా దృష్టి పెట్టడం లేదని స్థానికులు చెబుతున్నారు.



మీరు చూస్తున్న ఈ ఫొటో సిరిసిల్ల శివారులోని భూపతినగర్. నేతకార్మికులు ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టడం లేదు. గతంలో మాజీ మంత్రి కేటీఆర్ ప్రభుత్వం నుంచి రూ.75లక్షలు నిధులు మంజూరు చేయించినా పనులు ప్రారంభించలేదు. రోడ్లు, మోరీలు కట్టించాలన్న స్థానికుల విన్నపాలు బుట్టదాఖలైతున్నాయని వాపోతున్నారు.

విలీనం సమస్యల నిలయం

- సిరిసిల్ల మున్సిపాలిటీలోని విలీన గ్రామాల్లో సమస్యలెన్నో..
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- కనిపించని అభివృద్ధి

సిరిసిల్లటౌన్: ప్రథమశ్రేణి మున్సిపాలిటీ సిరిసిల్లలో విలీనమైన గ్రామాలు మౌలిక వసతుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. పట్టణ శివారు గ్రామాలైన పెద్దూరు, సర్దాపూర్, రాజీవ్‌నగర్, పెద్దబోనాల, చిన్నబోనాల, చంద్రంపేట, రగుడు గ్రామాల ప్రజలకు పాలకులు ఇస్తున్న హామీలు అమలుకు నోచుకోవడం లేదు. సిరిసిల్ల పట్టణం అభివృద్ధి చెందినా.. విలీన గ్రామాల్లో పరిస్థితులు మాత్రం భిన్నంగా ఉన్నాయి. విలీన గ్రామాలపై గ్రౌండ్‌రిపోర్టు..



ఇది సిరిసిల్ల శివారులోని ఒకటోవార్డుకు చెందిన జ్యోతినగర్. చిన్నపాటి వర్షానికే ఇలా బురదమయం కావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. విలీన గ్రామాల అభివృద్ధికి కేటాయించిన నిధులతో పనులు నిర్ణీత సమయంలో పూర్తికాకపోవడంతో ఇలా మారుమూల పల్లెలకన్నా హీనంగా ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీలే నయం

సిరిసిల్ల మున్సిపాలిటీలో విలీనమై ఎనిమిదేళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోవడం లేదు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధికి అనుగుణంగా తమ కాలనీల్లో పనులు జరగడం లేదని విలీన గ్రామాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్‌శాఖ మంత్రిగా స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ఉన్నప్పుడు సిరిసిల్లను సర్వతోముఖాభివృద్ధి చేస్తే.. స్థానిక నేతల నిర్లక్ష్యంతో విలీన గ్రామాల్లో మాత్రం సమస్యలు పరిష్కారం కాలేదు. విలీన గ్రామాలకు రూ. 75లక్షలు చొప్పున కేటాయించగా.. వాటితో చేపట్టాల్సిన అభివృద్ధి, మౌలిక వసతులు కల్పించలేదు. మున్సిపాలిటీలో విలీనమైనప్పటి నుంచి సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తమకు పంచాయతీలే మేలని.. మున్సిపాలిటీ వద్దని డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల ఎన్నికల సమయంలోనూ కేటీఆర్ సైతం ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా పంచాయతీలుగా మార్చడానికి సిద్ధమని ప్రకటించారు. కానీ ప్రభుత్వం మారడంతో తమ పరిస్థితి ఏంటని విలీన గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

బురదరోడ్లతో ఇబ్బందులు



మాఊరిలో సీసీరోడ్లు లేక వర్షాలు పడితే ఇబ్బందులు తప్పడం లేదు. పాలకులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. శ్మశాన వాటికకు పోవడానికి రోడ్డు లేదు. మోరీలు నిర్మించలేదు. బురదరోడ్లను పూర్తిగా అభివృద్ధి చేయాలి.

– సుల్తాన్ బాలరాజు, చంద్రంపేట

పాములు వస్తున్నాయి



ఎన్నికలప్పుడు రోడ్లు వేస్తామంటుండ్రు తప్ప వేస్తలేరు. రోడ్డంతా చెట్ల పొదలతో నిండి ఉంటుంది. రాత్రి పూట, వర్షాకాలంలో పాములు విపరీతంగా తిరుగుతున్నాయి. మోరీల్లేక మురుగునీరంతా రోడ్లపై నుంచి పారుతుంది. దోమల బెడద తప్పించి, కరెంటు స్తంభాలు ఏర్పాటు చేయాలి.

– కర్రె రాజు, భూపతినగర్

ఉపాధిహామీ అమలు చేయాలి



మహిళలకు పనుల్లేక చిట్టీ డబ్బులు కట్టడానికి ఇబ్బందులు పడుతుండ్రు. విలీన గ్రామాల్లో నిలిపివేసిన ఉపాధిహామీ పనులు ప్రారంభించాలి. పవర్‌బోరు ద్వారా నీరును అందిస్తున్నారు. మిషన్ భగీరథ ద్వారా మంచినీరు సరఫరా చేయాలి. వెలుగని వీధి దీపాలను సరిచేయాలి.

– పడిగె వసంత, చిన్నబోనాల

విలీన గ్రామాల్లో సమస్యలు ఇవీ..

- సిరిసిల్ల మున్సిపల్‌లో విలీనమైన ఏడు గ్రామాల ప్రజలు ఉపాధిహామీ పథకానికి దూరమయ్యారు. దాదాపు 2వేలకు పైగా జాబుకార్డులు ఉండగా, 4500 మంది ఉపాధిహామీ పనులకు దూరమయ్యారు. దీంతో నిరుపేద కూలీల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.
- సిరిసిల్ల–చంద్రంపేట ప్రధాన రహదారిపై పైపులైన్ లీకేజీతో మురికికూపం ఏర్పడింది.
- కొన్ని ఏరియాల్లో నల్లానీరు రాక.. పవర్‌బోర్లు లేక ప్రజలు నీటికోసం గోస పడుతున్నారు.
- ఏడు విలీన గ్రామాల్లో ఏ వీధిని చూసిన అసంపూర్తి రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి వ్యవస్థ, విద్యుత్ దీపాలు లేక వెలవెలబోతున్నాయి.
- గ్రామాల్లోని అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్షానికే చిత్తడవుతున్నాయి.
- డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.
- కొన్ని గ్రామాల్లో శ్మశానవాటికలు లేవు. మరి కొన్ని గ్రామాల్లో నిర్మాణాలు పూర్తికాలేదు.